

నమ్మి మోసపోవద్దు

కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత పేర్కొన్నారు. - 11లో



కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

భువనగిరి ఖిలాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 11లో



శేఖర్‌రెడ్డిని గెలిపించాలి

ఎమ్మెల్యేగా పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. - 11లో

న్యూస్‌రీల్

నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్యకైంకర్యాలు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టి అర్చన, అభిషేకం జరిపించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు ఈనెల 17

భువనగిరి : మార్చిలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో ఈ నెల 18నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 11వరకు , రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. గ్రామీణ విద్యార్థులు రూ.20 వేలు, పట్టణ ప్రాంత విద్యార్థులు రూ.24 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్నట్లు సంబంధిత తహసీల్దార్ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే వారికి ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు.

పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ హోమం



హోమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి రూరల్ : బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్ రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు శనివారం భువనగిరి మండలం నమాత్‌పల్లిలోని స్వయంభు పూర్ణగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన శేఖర్‌రెడ్డిని మూడవసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అతికం లక్ష్మీనారాయణగౌడ్, ఎంపీపీ నిర్మల వెంకటస్వామి, జెడ్పీ సుబ్బారు బీరు మల్లయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కంచి మల్లయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేపు గ్రహణం మొర్రి ఉచిత వైద్యశిబిరం

భువనగిరి : జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉచిత గ్రహణ మొర్రి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష, బసవ తారకం స్మైల్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలోక్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నెలల నుంచి 60 ఏళ్ల వరకు వయస్సున్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9908469333ను సంప్రదించాలని కోరారు.

జూడో పోటీల్లో మెడల్



కాంస్య పతకం సాధించిన ప్రణవి

ఆలేరురూరల్ : మండలంలోని కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రణవి రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో కాంస్య పతకం సాధించింది. హన్మకొండలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో అండర్-14 విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ప్రణవిని వ్యాయామ ఉపాధ్యాయుడు పద్మకుమారి, సంధ్య, రాములు, కొరుటూరి సత్యనారాయణ, విజయ్, గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్ పరిశీలకులు వీరే..

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించింది. దేవరకొండకు రాజా వెంకటప్ప నాయక్, నాగార్జునసాగర్‌కు చిమనకట్టి భీమసేన్, సూర్యాపేటకు నారా భరత్‌రెడ్డి, మిర్యాలగూడ యూబీ బంకర్, భువనగిరికి ప్రకాష్ హుక్కేరి, తుంగతుర్తికి సుధందాస్, ఆలేరుకు శరణగౌడ పాటిల్‌ను నియమించింది.

రెండో రోజు 28 నామినేషన్లు

హుజూర్‌నగర్‌లో నిల్

నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో రోజు శనివారం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. 12 నియోజకవర్గాలకు గాను 11 చోట్ల నామినేషన్లు వేశారు. హుజూర్‌నగర్‌లో దాఖలు కాలేదు. దేవరకొండలో బీఆర్ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బాలునాయక్, ఇండిపెండెంట్ నామినేషన్ వేశారు. నల్లగొండలో స్వతంత్ర్య అభ్యర్థిగా చొల్లేటి ప్రభాకర్, ఆలిండియా ఫార్వర్డు బ్లాక్ నుంచి ఒకరు, మరో ముగ్గురు ఇండిపెండెంట్లు , నాగార్జునసాగర్‌లో ముగ్గురు ఇండిపెండెంట్లు, మిర్యాలగూడలో ఇద్దరు ఇండిపెండెంట్లు, మునుగోడులో నలుగురు ఇండిపెండెంట్లు, సోషల్ జస్టిస్ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి ఒకరు, నకిరేకల్‌లో ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లు సమర్పించారు. తుంగతుర్తిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒకరు, సూర్యాపేటలో ఒక ఇండిపెండెంట్, కోదాడలో ఇద్దరు స్వతంత్రులు నామినేషన్లు వేశారు.భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి తరఫున పార్టీ నాయకులు రెండు సెట్ల నామినేషన్లు వేశారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి నుంచి ఒకరు, స్వతంత్ర్య అభ్యర్థిగా మరొకరు నామినేషన్ వేశారు. ఆలేరు నియోజకవర్గంలో విద్యార్థి రాజకీయ పార్టీ తరఫున ఒక నామినేషన్ దాఖలైంది. రెండు రోజుల్లో కలిపి మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి.

2వ రోజు నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు		మొత్తం
నల్లగొండ	5	07
కోదాడ	2	03
సూర్యాపేట	1	02
మునుగోడు	5	08
నాగార్జునసాగర్	3	04
నకిరేకల్	2	05
ఆలేరు	1	03
తుంగతుర్తి	1	02
మిర్యాలగూడ	2	04
భువనగిరి	3	03
హుజూర్‌నగర్	-	–
దేవరకొండ	3	03
మొత్తం	28	44

ఆధారం ఏదీ..

- పీపుల్స్ ఎజెండాలో చేనేత కార్మికుల ఆవేదన



చేనేత రంగానికి ప్రభుత్వాల నుంచి భరోసా లభించడం లేదని చేనేత కార్మికులు అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. 10లో▸

ఉద్యోగులపై కొరడా

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురి సస్పెన్షన్

- సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి
- విచారణ చేసిన అధికారులు
- వాస్తవమని తేలడంతో చర్యలు



సాక్షి, యాదాద్రి : ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే ప్రభుత్వ ఉద్యోగులపై ఈసీ కొరడా ఝుళిపిస్తోంది. రాజకీయ పార్టీలకు అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన వారిని గుర్తించి చర్యలకు ఉపక్రమిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ అనుబంధ శాఖల సిబ్బంది ముగ్గురిపై రిప్రజెంటీవ్ ఆఫ్ ది ప్రివెంటీవ్ యాక్ట్ 1951 ప్రకారం జిల్లా ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. ఏ రాజకీయ పార్టీకైనా కొమ్ముకాస్తూ ప్రచారంలో పాల్గొన్నా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

నియమావళి ఉల్లంఘించారని..

భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరులో గ్రామ సంఘం వీఓఏగా పనిచేస్తున్న కేతం స్వరూపను జిల్లా ఎన్నికల అధికారి సస్పెండ్ చేశారు. రాజకీయ పార్టీల తరఫున ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటుందని ఆరోపణలు వచ్చాయి. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేయగా వాస్తవమని తేలింది. దీంతో ఎన్నికల నియమావళి జీఓ నం 58 ప్రకారం స్వరూపను గ్రామ సంఘం తీర్మానం చేసి విధుల నుండి తొలగించినట్లు డీఆర్‌డీఓ నాగిరెడ్డి తెలిపారు. అదే విధంగా తెలంగాణ సాంస్కృతిక కళామండలి కళాకారులు యాట సంధ్య, ఉప్పలయ్యను జిల్లా ఎన్నికల అధికారి విధుల నుంచి తొలగించారు. వీరు బీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున పార్టీ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేస్తుండగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విచారణ జరిపిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హన్మంత్ కె.జండగే.. వారిద్దరిని సస్పెండ్ చేశారు.

సోషల్ మీడియాలో వైరల్

ప్రభుత్వ ఉద్యోగులు, అనుబంధ శాఖల ఉద్యోగులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సోషల్ మీడియాలో ఇస్తున్న లైవ్ ప్రోగ్రాంలలో దొరికిపోతున్నారు. జిల్లాలో సస్పెండ్ అయిన ముగ్గురు సోషల్ మీడియా ద్వారానే పార్టీలకు అనుబంధంగా పనిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చారు.

ఇంకా విధుల్లోనే పీఎస్‌లు, పీఏలు!

ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వద్ద పర్సనల్ సెక్రటరీ, పీఏలుగా నియమించిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఇంకా వారి వద్దనే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగా కనిపించనప్పటికీ ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఎన్నికల విధుల నుంచి ఎంపీడీఓలు ఔట్

ఎన్నికల విధుల నుంచి ఎంపీడీఓలను తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలుగా విధుల్లో ఉంటే వారిని వెంటనే తొలగిస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడంతో జిల్లాలో పనిచేస్తున్న వారు, సొంత జిల్లా ఎంపీడీఓలను వెంటనే ప్రత్యక్ష ఎన్నికల విధుల నుంచి రిలీవ్ చేయాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లాలో ఐదుగురు ఎంపీడీఓలను ఎన్నికల విధుల నుంచి తప్పించనున్నారు.

శిక్షణకు గైర్హాజరైన వారికి నోటీసులు

ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణకు గైర్హాజరైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 26 మందికి జిల్లా ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల రెండు రోజుల పాటు పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. అయితే ఇందులో కొందరు అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో రాలేకపోయామని సంజాయిషీ ఇచ్చారని రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు.

నాలుగు నియోజకవర్గాల్లో సీఎం సభలు ఖరారు

- 14న నాగార్జునసాగర్, 20న నకిరేకల్, నల్లగొండ, 21న సూర్యాపేటలో కేసీఆర్ పర్యటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 14, 20,21 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. రెండో విడతగా కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 13వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా 1న నాగార్జునసాగర్, 20న నకిరేకల్, నల్లగొండలో, 21న సూర్యాపేటలో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఇప్పటికే భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ ప్రచార సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో పర్యటన ఇప్పుడు ఖరారైంది.

భువనగిరి నుంచి పోటీ చేస్తాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని, వామపక్ష, సామ్యవాద, సామాజిక అభ్యుదయ వాదులంతా బలపరచాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు తెలిపారు. భువనగిరిలోని సుందరయ్య భవనంలో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రజా పోరాటాలు చేసిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. మూసీ కాలుష్యం, గోదావరి జలాల సాధన, బస్వాపూర్ రిజర్వాయర్, పిల్లాయిపల్లి, గంధమల్ల, బునాదిగాని కాల్వల ఆధునీకరణ కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణాల్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించామన్నారు. మూసీ ప్రక్షాళన కోసం మూసీ పోరుయాత్ర, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం జన చైతన్యయాత్రలు చేశామని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, మహిళా సమస్యలపై ఎప్పటికప్పుడు పాలకులను నిలదీస్తూ పోరాటాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల పక్షాన నిలిచిన సీపీఎం.. భువనగిరి నుంచి బరిలోకి దిగుతున్నందున ప్రజాతంత్ర పోరాట శక్తులు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ సీపీఎంను ఆదరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నర్సింహ, అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు, మల్లేశం, నర్సిరెడ్డి, అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, బొల్లు యాదగిరి, జల్లెల పెంటయ్య, బండారు నరసింహ, గంగాదేవి సైదులు, బొడ్డుపల్లి వెంకటేష్, గుండు వెంకటనర్సు, గుంటోజు శ్రీనివాస్ చారి, దోడ యాదిరెడ్డి, అవ్వారు రామేశ్వరి, గడ్డం వెంకటేష్, ఇక్బాల్ పాల్గొన్నారు.

ఎడతెగని జాప్యం

మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్

- తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడలో వీడని ఉత్కంఠ
- రంగంలోకి దిగేదెప్పుడు.. ప్రచారం చేసుకునేదెప్పుడు?
- తీవ్ర నిరాశలో ఆశావహులు.. గందరగోళంలో పార్టీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. మిగతా మూడు స్థానాలపై ఇంకా తేల్చడం లేదు. దీంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ రెండు నెలల కిందటే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించి, ప్రచారంలో దూసుకుపోతోంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ 8 సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ మాత్రం అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులనే ప్రకటించకపోవడంతో ఆశావహులు అయోమయంలో పడ్డారు. త్వరగా తేల్చాలంటూ ఢిల్లీ బాట పట్టారు.

సొంత అభ్యర్థులనూ తేల్చని కాంగ్రెస్

మిర్యాలగూడ వ్యవహారం పొత్తు నేపథ్యంలో గందరగోళంలో పడగా.. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో సొంత అభ్యర్థులను ప్రకటించే విషయంలోనూ కాంగ్రెస్ నాన్చుడు ధోరణినే ప్రదర్శిస్తోంది. దీంతో అక్కడ ఎవరికి టికెట్ ఇస్తారన్న అయోమయం నెలకొంది. రెండుచోట్ల కాంగ్రెస్ నుంచి ఇద్దరు చొప్పున అభ్యర్థులు టికెట్ కోసం పోటీపడుతున్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోవైపు బీజేపీ కూడా సంకినేని వెంకటేశ్వర్‌రావు పేరు ప్రకటించింది. తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తే.. తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ గతంలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి కూడా అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందన్న ఆశతో ఉన్నారు. అయితే, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కూడా తుంగతుర్తి టికెట్ కోసం పట్టుబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరువురిలో టికెట్ ఎవరికనేది కాంగ్రెస్ పార్టీ తేల్చడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై.. నామిషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైనా కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థులను తేల్చకపోవడంతో ఆశావహులు ఎదురుచూపులతో కాలం గడుపుతున్నారు. అభ్యర్థుల ప్రకటన విషయంలో పార్టీ ఆలస్యం చేసిన కొద్దీ ప్రచారంలో వెనుకబడిపోతామనే ఆందోళన వారిని వెంటాడుతోంది.

పొత్తు పేరుతో నాన్చుడు ధోరణి

కాంగ్రెస్ పార్టీ రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రెండు విడతల్లో 9 నియోజక వర్గాల అభ్యర్థులను ఖరారు చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఇక మునుగోడు నియోజకవర్గంలో పొత్తులో భాగంగా సీపీఐకి ఇస్తామని ఒప్పందం కుదుర్చుకునే సమయంలోనే బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేరడంతో, రెండో జాబితాలో మునుగోడు స్థానాన్ని రాజగోపాల్‌రెడ్డికి కేటాయించింది. దీంతో సీపీఐ ఒంటరిపోరుకు సిద్ధమైంది. పొత్తులో భాగంగా మిర్యాలగూడ సీటు సీపీఎం కోరుకుంది. అక్కడ కాంగ్రెస్ నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి టికెట్ కోసం పట్టుబడుతున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే విషయంలో నాన్చుడు ధోరణి అవలంబించడంతో సీపీఎం.. కాంగ్రెస్‌కు గడువు పెట్టింది. ఆ గడువులోగా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఒంటరిగా పోటీలో ఉంటామని సీపీఎం ప్రకటించింది. అయినా ఇప్పటికీ కాంగ్రెస్‌తో చర్చలు జరుపుతూనే ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు ఇస్తుందా..? తన అభ్యర్థినే పోటీలో నిలుపుతుందా? తేల్చడం లేదు. దీంతో అక్కడ కాంగ్రెస్ ఆశావహుల తోపాటు సీపీఎం నాయకులు అయోమయంలోనే ఉన్నారు.

పోలింగ్‌పై పూర్తి అవగాహన ఉండాలి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి పోలింగ్ రోజు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలని, పోలింగ్ ఏజెంట్లకు సీక్రెసి ఓటింగ్, పోలింగ్ నియమాలపై వివరించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. 50కి తగ్గకుండా ఓట్లు వేయాలని, రిజల్ట్ చూసిన తర్వాత ఈవీఎంను క్లియర్ చేయాలని, అనంతరం అసలైన పోలింగుకు సన్నద్ధం కావాలని సూచించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశం గురించి తెలిసి ఉండాలని పేర్కొన్నారు. హ్యాండ్ బుక్‌లో సూచించిన విధంగా పోలింగ్ సామగ్రిని సేకరించుకోవాలని వివరించారు. ఫారాలు, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ కవర్లు, మాక్‌పోల్ సర్టిఫికెట్ ఇచ్చే విధానం, ఈవీఎంలను క్లోజ్ చేయడం, వీవీప్యాట్ నుంచి వచ్చే స్లిప్, పోలింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్లలో ఇబ్బందులు తలెత్తితే సమస్య పరిష్కారంపై అవగాహన పొందాలని సూచించారు. మాక్ పోలింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏదైనా పనిచేయకపోతే దానిని మాత్రమే మార్చాలని, అసలైన పోలింగ్ సమయంలో సమస్య తలెత్తితే రెండిటిని మార్చాలన్నారు. బ్యాలెట్ గోప్యతను కాపాడే విధంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

హెల్ప్‌డెస్క్‌లు తప్పనిసరి

పోలింగ్ కేంద్రం ఉన్న ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల జాబితా ఫారాన్ని పోలింగ్ స్టేషన్ బయట ప్రదర్శించాలని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచించారు. ఓటర్లకు సహాయ, సహకారం అందజేయడానికి బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా హెల్ప్‌డెస్కులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టెండర్, చాలెంజ్, టెస్ట్ ఓట్లపై అవగాహన పెంచుకోవాలని వివరించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్ బటన్ క్లోజ్ చేసి డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. హ్యాండ్‌బుక్‌లోని సూచించిన ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై వివరించారు. అదే విధంగా జిల్లా మాస్టర్ ట్రైనర్ హరినాథ్‌రెడ్డి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ విధులు, బాధ్యతలపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజాపేట మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో అభ్యర్థి బీర్ల అయిలయ్య

ఆత్మకూరు(ఎం) : ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య శనివారం ఆత్మకూరు(ఎం) మండలంలోని తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాపేట, బేగంపేట, నర్సాపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి బీర్ల అయిలయ్య పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రాజాపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిర్తి రాజిరెడ్డి, రాజాపేట సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మ, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు గౌడె లక్ష్మణ్, రఘునాథపురం సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్, మాజీ సర్పంచ్ అంకతి బాలయ్యతో పాటు మాజీ సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధికి పాటుపడుతా

బీబీనగర్ : ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే భువనగిరి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం, ముగ్దుంపల్లి, రావిపహాడ్, మాదారం గ్రామాల్లో శనివారంఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎటువంటి పదవి లేకపోయినా నియోజకవర్గంలోని కులవృత్తులదారులకు పనిముట్లు అందజేశానని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ఉచిత కోచింగ్ ఇప్పించినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్యే చేయలేని పనులు తాను చేశానని, ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బీబీనగర్ మండల శాఖ అధ్యక్షుడు సుర్కంటి జంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



దేవరకొండ ఆర్‌ఓ కార్యాలయంలో శనివారం నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్



స్వతంత్ర అభ్యర్థిగా నల్లగొండ ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

ఎన్నిక ఏదైనా.. నామినేషన్ పక్కా

1996 నుంచి చట్టసభల బరిలో ఉంటున్న మారం వెంకట్‌రెడ్డి

సూర్యాపేట: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మారం వెంకట్‌రెడ్డి 1996 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో నామినేషన్ వేసి పోటీలో ఉన్నారు. ఈసారి కూడా ఆయన శుక్రవారం నల్లగొండ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేశారు.



నల్లగొండలో శుక్రవారం నామినేషన్ వేసిన మారం వెంకట్‌రెడ్డి

1996 నుంచి..

మారం వెంకట్‌రెడ్డి 1996లో మొదటిసారి మిర్యాలగూడ పార్లమెంట్ స్థానంలో పోటీ చేశారు. 1999, 2004లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి, 2009, 2014, 2018లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా అసెంబ్లీ బరిలో నిలిచారు. 2019లో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి, అదే సంవత్సరం జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో పోటీ చేశారు. 2021లో జరిగిన నాగార్జున సాగర్ ఉప ఎన్నికలో సైతం నామినేషన్ వేసి అనారోగ్యం కారణంగా విత్‌డ్రా చేసుకున్నారు. 2022లో మునుగోడు ఉప ఎన్నికలో, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేశారు. సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి ఈ నెల 6వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు శనివారం ఆయన పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ నాలుగోసారి..

త్రిపురారం, నిడమనూరు: త్రిపురారం మండలం లచ్యతండాకు చెందిన ఆటో డ్రైవర్ పానుగోతు లాల్‌సింగ్ నాయక్ శనివారం నిడమనూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. 2018 ఎన్నికల్లో మొదటిసారి నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశానని, అదే విధంగా 2021లో సాగర్ ఉప ఎన్నికలో, 2022లో మునుగోడు ఉప ఎన్నికలో నామినేషన్ వేశానని, ఇప్పుడు నాలుగోసారి నామినేషన్ వేసినట్లు ఆయన పేర్కొన్నాడు. ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, గిరిజన తండాల్లో రాజకీయ చైతన్యం రావాలనే ఉద్దేశంతోనే స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో నామినేషన్ వేసి ప్రచారం కూడా చేస్తున్నానని చెబుతున్నాడు.



నిడమనూరు: నామినేషన్ దాఖలు చేస్తున్న పానుగోతు లాల్‌సింగ్‌నాయక్



త్రిపురారం: ఆటో నడుపుతున్న లాల్‌సింగ్‌నాయక్

జంగ్ తెలంగాణ

పైళ్ల శేఖర్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.227.78 కోట్లు

- ఆయన పేరుమీద రూ.159.50 కోట్లు..
- సతీమణి పేరుమీద రూ.68.28 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడి
- గతంతో పోలిస్తే పెరిగిన ఆస్తులు

భువనగిరి: భువనగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి ఆస్తులు గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి భారీగా పెరిగాయి. శేఖర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ నాయకులు శనివారం భువనగిరి రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్‌ఓ) కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలలో శేఖర్‌రెడ్డి పేరు మీద మొత్తం రూ.159.50 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉండగా.. ఆయన సతీమణి వనితారెడ్డి పేరు మీద రూ.68.28కోట్ల ఆస్తులు ఉన్నట్లు చూపించారు. ఇందులో ఆయన పేరు మీద రూ.120,70,33,601, ఆయన భార్య పేరిట రూ.4,36,26,517 చరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. శేఖర్‌రెడ్డి కుమార్తె పేరిట రూ.1,75,064, కుమారుడు పేరిట రూ.49,000 చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. శేఖర్‌రెడ్డి పేరిట స్థిరాస్తులు రూ.38,80,64,800, ఆయన సతీమణి పేరిట రూ.63,92,36,495 స్థిరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం శేఖర్‌రెడ్డి చేతిలో రూ.3,21,510, ఆయన సతీమణి చేతిలో రూ.9,25,138 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డి పేరున రూ.90,61,17,133, ఆయన భార్య పేరు మీద రూ.22,13,96,627 అప్పులు ఉన్నట్లు చూపించారు.

2018 కంటే పెరిగిన ఆస్తులు..

2018 ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్ ప్రకారం పైళ్ల శేఖర్‌రెడ్డి పేరున రూ.69,00,80,939, ఆయన సతీమణి పేరుమీద రూ.5,39,68,923 విలువ చేసే చరాస్తులు ఉన్నాయి. అదేవిధంగా అప్పట్లో గతంలో ఆయన పేరు మీద రూ.1,59,25,323, ఆయన సతీమణి పేరున రూ.15,03,18,620 విలువ చేసే స్థిరాస్తులు ఉన్నాయి.



- చేనేత పథకాలను మరింత సరళీకృతం చేయాలి
- చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలి
- కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధి కేటాయిస్తే మేలు
- వస్త్రాలను ప్రభుత్వం మార్కెటింగ్ చేస్తే కార్మికులకు ఉపాధి దొరుకుతుంది
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో చేనేత కార్మికుల డిమాండ్



పోచంపల్లిలోని టై అండ్ డై అసోసియేషన్ భవనంలో నిర్వహించిన పీపుల్స్ ఎజెండాకు హాజరై సమస్యలు చెప్పుకుంటున్న చేనేత కార్మికులు

ఆధారం ఏదీ..

మహ్మద్ అలీ షరీఫ్, భూదాన్ పోచంపల్లి

పీపుల్స్ ఎజెండా

పోగు.. పోగును వస్త్రంగా మలిచి మనిషి మానాన్ని కాపాడేది చేనేత వృత్తి. కానీ, ఇప్పుడు నేతన్నకు విలువలేదు. నేసే బట్టకు గిరాకీ లేదు. ప్రజల నుంచి మద్దతు లేదు. ప్రభుత్వాల నుంచి భరోసా లేదు. మగ్గం నడవట్లేదు. వేరే మార్గం కనిపించడం లేదు. బతుకు సాఫీగా సాగుతలేదు. అయినా చేనేత కార్మికులు తమ వృత్తిలోనే ఉపాధి వేట సాగిస్తున్నారు. శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలో 'చేనేత సమస్యలు– పరిష్కార మార్గాలు' అంశంపై నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో చేనేత కార్మికులు, నాయకులు పాల్గొని వారి సమస్యలను ఏకరువు పెట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నా.. అవి కార్మికులకు పూర్తిస్థాయిలో దరిచేరడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత మగ్గాలు, మరమగ్గాలపై ఆధారపడి సుమారు 20వేల మందికి పైగా జీవనోపాధి పొందుతున్నారు. కానీ, చేనేత జౌళిశాఖలో సిబ్బంది కొరతతో చేనేత పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించడం లేదు. దాంతో ప్రభుత్వ పథకాలపై అవగాహన లేక వాటి ఫలాలను పొందలేకపోతున్నారు. మరోవైపు చేనేత పథకాల్లో ఉన్న సాంకేతిక సమస్యలు, కొర్రీల వల్ల పథకాలు కార్మికులకు అందని ద్రాక్షాలా మారాయి. చేనేత పథకాలను మరింత సరళీకృతం చేసి కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. అదే విధంగా చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలని, నూలు, ముడి సరుకు ధరలను నియంత్రించాలని కోరుతున్నారు. రైతుల మాదిరిగానే చేనేత కార్మికుల నుంచి ప్రభుత్వమే వస్త్రాలను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయాలని పేర్కొంటున్నారు. చేనేత రుణమాఫీ చేయాలని, హెల్త్ కార్డుల ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలని కోరుతున్నారు.



పీపుల్స్ ఎజెండాలో పాల్గొన్న చేనేత కార్మికులు, నాయకులు

పథకాలను సులభతరం చేయాలి



చేనేత పథకాలు పొందాలంటే అనేక నిబంధనలు పెట్టారు. నూలు సబ్సిడీ బిల్లులు సక్రమంగా వస్తలేవు. బ్యాంకు అకౌంటుకు ఆధార్‌లింక్ లేదని చేనేత మిత్ర పథకం కింద మగ్గానికి ఇచ్చే రూ.3 వేలు అందరికీ అందడం లేదు. చేనేత పథకాలను సులభతరం చేసి అర్హులందరికి అందజేయాలి. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా నాలుగేళ్లుగా కార్మికులకు నేతకూళ్లు పెంచలేదు.

– కర్నాటి పురుషోత్తం, చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

బీమా అమలు చేయాలి



నేతన్న బీమా వయస్సును 59 సంవత్సరాల నుంచి 75 సంవత్సరాల వరకు పొడిగించాలి. నూలు సబ్సిడీ, త్రిఫ్ట్, చేనేత మిత్ర పథకాలను అర్హులందరికీ అందజేయాలి. చేనేత జౌళిశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేయాలి. పోచంపల్లిలో చేనేత అధికారి కార్మికులకు అందుబాటులో ఉండేలా చూడాలి.

– మునునూరి యాదగిరి, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు

షోరూమ్‌లు ఏర్పాటు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రముఖ నగరాలు, పట్టణాల్లో షోరూమ్‌లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేయాలి. దానివల్ల కార్మికులకు ఉపాధి మెరుగవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వర్క్‌షెడ్ పథకం, నూలు సబ్సిడీని సక్రమంగా అమలయ్యేలా చూడాలి.

– బోడ దయానంద్, చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు

చేనేత రుణమాఫీ చేయాలి



చేనేత పథకాలు బాగున్నాయి. కానీ అధికారులు వాటిపై అవగాహన కల్పిస్త లేరు. దీనికి తోడు పథకాల్లో ఉన్న నిబంధనలు కార్మికులకు గుదిబండగా మారాయి. ఏ పథకం అమలు చేసినా సరే చేనేత కార్మికుడి ఖాతాలో నేరుగా డబ్బులు పడేటట్లు చేయాలి. రైతుల మాదిరిగానే చేనేత రుణమాఫీ చేసి కార్మికులను ఆదుకోవాలి.

– మన్న యాదమ్మ, చేనేత కార్మికురాలు

ఎన్నికలు నిర్వహించాలి



ఎన్నికలు నిర్వహించి చేనేత సహకార సంఘాలను పటిష్టం చేయాలి. ప్రభుత్వం జిల్లాకు రూ.120 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే అందులో కేవలం రూ.10.61 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అధికారుల వైఫల్యం వల్ల ప్రభుత్వ ఫలాలను కార్మికులకు అందడం లేదు. జిల్లాలో 33 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరం.

– చింతకింది రమేశ్, చేనేత రాష్ట్ర నాయకుడు

పథకాల కింద చీరలు అందించాలి



ప్రభుత్వం నేరుగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఆర్థిక సాయంతోపాటు పట్టుచీరె, పట్టు దోవతి ఇవ్వాలి. జియో ట్యాగింగ్ మగ్గం కల్గిన ప్రతి చేనేత కార్మికుడికి నేరుగా రూ.3వేలు ఇవ్వాలి. అలాగే చేనేత సహకార సంఘాలకు క్యాష్‌క్రెడిట్ ఇచ్చి సంఘాలను పటిష్టం చేయాలి.

– భూషణ్, చేనేత కార్మిక సంఘం డైరెక్టర్

పార్కును వినియోగంలోకి తేవాలి



పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును త్వరగా వినియోగంలోకి తీసుకరావాలి. ఇక్కడి కార్మికులకు చేతినిండా పని కల్పించాలి. అలాగే చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద పేరుకుపోయిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

– బేతి మధుసూధన్, చేనేత డిజైనర్

హెల్త్‌కార్డులు అందజేయాలి



ప్రభుత్వం చేనేత కార్మికులకు హెల్త్‌కార్డులను అందజేయాలి. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. చేనేత కార్మికులకు రూ.5 లక్షలతో గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి.

– గజ్జెల రామకృష్ణ, చేనేత కార్మికుడు

చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. నిష్ణాతులైన చేనేత కార్మికులు, కళాకారులు నిలదొక్కుకునేందుకు ఆర్థిక సాయం అందించాలి. ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణలో కూడా చేనేత కార్మికులకు వర్క్‌షెడ్ పథకాన్ని, పక్కా ఇళ్లు, నేరుగా కార్మికుడికి రూ.24 వేలు ఇవ్వాలి.

– భోగ రఘు, చేనేత కళాకారుడు

నూలు కేంద్రం ఏర్పాటు చేయాలి



పోచంపల్లిలో నూలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. పెరుగుతున్న నూలు, రంగులు, రసాయన ధరలను నియంత్రించాలి. ఫిక్స్‌డ్ ధరను నిర్ణయించి కార్మికులకు నూలును అందించాలి. నూలు సబ్సిడీ నెలనెలా అందించాలి.

– శ్రీనివాస్, చేనేత పరిరక్షణ సమితి నాయకుడు

హ్యాండ్లూమ్ కోర్సులను ప్రవేశపెట్టాలి



డిగ్రీ కళాశాలల్లో హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టాలి. చేనేత డిజైన్లపై కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. చేనేత వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికి గుర్తింపుకార్డులు ఇచ్చి, వారి జీవన ప్రమాణాలు పెంచాలి. చేనేత కార్మికుల పిల్లలకు ఉచితంగా కేజీ టూ పీజీ విద్యనందించాలి. రైతుల మాదిరిగానే చేనేత బంధు పథకాన్ని అమలు చేయాలి.

– గంజి యుగేంధర్, ఇక్కత్ వరల్డ్ అధినేత

రిజర్వేషన్ యాక్ట్‌ను కాపాడాలి



11 రకాల చేనేత వస్త్రాలకు ఉద్దేశించిన రిజర్వేషన్ యాక్టును 9వ షెడ్యూల్‌లో చేర్చి నకిలీ వస్త్రాల తయారీని నిరోధించాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ యాక్ట్‌ను కాపాడాలి. చేనేత సహకార సంఘాల యాక్ట్‌లో ఉన్న షేర్ క్యాపిటల్ విధానాన్ని ఎత్తివేసి వృత్తి క్యాపిటల్ విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికలు నిర్వహించాలి.

– మిర్యాల కృష్ణమూర్తి, చేనేత నాయకుడు

యాదాద్రిలో స్మితా సబర్వాల్ దంపతులు



యాదాద్రీశుడి సన్నిధిలో స్మితా సబర్వాల్, అకున్ సబర్వాల్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులు, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.

పేలిన కెమికల్ రియాక్టర్

చిట్యాల: చిట్యాల పట్టణ పరిధిలో ఐడియల్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో శనివారం వేస్టేజ్ కెమికల్స్ రియాక్టర్ అకస్మాత్తుగా పేలింది. దీంతో భారీ శబ్దంతో రియాక్టర్‌లోని కెమికల్స్ గాలిలోకి విడుదలయ్యాయి. రియాక్టర్‌లో గాలి పీడనం ఎక్కువ కావడంతో పేలుడు సంభవించినట్లు పరిశ్రమ ఉద్యోగులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ మహేష్, చిట్యాల డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్‌లు పరిశీలించారు. పేలుడు జరిగిన సమయంలో రియాక్టర్ వద్ద ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వారు పేర్కొన్నారు.

డీఎస్పీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

మిర్యాలగూడ టౌన్: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) అధికారంలోకి వస్తే కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్టీఆర్‌ఎస్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు షో నిర్వహించారు. మిర్యాలగూడ డీఎస్పీ అభ్యర్థిగా తరి ఎల్లయ్యను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు డీఎస్పీ అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీకి పంపించాలన్నారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను వివరించారు. తెలంగాణలో కాన్షీరాం పొలిటికల్ లీడర్‌షిప్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పిస్తామని, మహిళలకు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కేంద్రంపై పోరాడి మాదిగలకు 12శాతం రిజర్వేషన్లతో కూడిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సాధిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్ మహరాజ్, వివిధ మండలాల అధ్యక్షులు వెంకటేష్, నగేష్, సైదులు, కళ్యాణ్ పాల్గొన్నారు.




మిర్యాలగూడలో తరి ఎల్లయ్యను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న విశారదన్ మహరాజ్

ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే..

రామగిరి(నల్లగొండ): బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించేందుకే డీఎస్పీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని విశారదన్ మహరాజ్ అన్నారు. శనివారం నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి పుల్లెంల శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జిల్లా కార్యదర్శి రవి, వినోద్, వంశీ, దినేష్ పాల్గొన్నారు.

వంగాల స్వామిగౌడ్‌కు నివాళి



నెమలికాల్వలో స్వామిగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

వలిగొండ: మండలంలోని నెమలికాల్వకు చెందిన సీనియర్ నాయకుడు వంగాల స్వామిగౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శనివారం ఆయన స్వగ్రామంలో దశదిన కర్మ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి వంగాల కిరణ్‌కుమార్‌రెడ్డి, వంగాల ఈశ్వరయ్యగౌడ్, చక్రవర్తిగౌడ్, చెరుకు సుధాకర్, తండు సైదులుగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, వంగాల వెంకన్న, తుమ్మల వెంకట్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, గూడూరు శివశాంత్ రెడ్డి, గూడూరు శ్రీధర్ రెడ్డి, కొమిరెల్లి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.77లక్షలు పట్టివేత


ఆలేరురూరల్: పట్టణంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ బ్యాంక్‌కు సంబంధించిన ఎస్‌జే ఎంటర్‌ప్రైజెస్ వాహనంలో రూ.77లక్షలను హైదరాబాద్ వైపు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద సరైన పత్రాలు లేనందున సీజ్ చేస్తున్నట్లు సీఐ సురేందర్ రెడ్డి, ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై తేనెటీగల దాడి



తేనెటీగలు దాడి చేయడంతో పరుగులు తీస్తున్న మహిళలు, కార్యకర్తలు

ఆలేరురూరల్: ఆలేరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గొంగిడి సునీత శనివారం ఉదయం ఆలేరు మున్సిపాలిటీలోని కొలనుపాక రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై ప్రచారం చేస్తుండగా సమీపంలోని వేప చెట్టు వద్దకు రాగానే ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో నాయకులు, కార్యకర్తలు పరుగులు తీశారు. దాదాపు 20 మందికి తేనెటీగలు కుట్టాయి. కొందరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తేనెటీగలను కుట్టిన కార్యకర్తల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే గొంగిడి సునీత వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.



తేనెటీగలు దాడి చేస్తుండడంతో పొగబెడుతున్న కార్యకర్తలు